
పూజకు పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


శ్రావణ శుక్రవారం సందర్భంగా పూలకు పెరిగిన గిరాకీ


గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

శ్రావణ శోభ

- కిక్కిరిసిన పూర్ణామార్కెట్
- పెరిగిన అరటి పళ్లు, పువ్వుల ధర

జగదాంబ : పూర్ణామార్కెట్ శ్రావణ శోభ సంతరించుకుంది. ఆగస్టు 15 నేపథ్యంలో సెలవు కావడంతో కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ కిక్కిరిసిపోయింది. నగరంలో ఎక్కడికక్కడే రైతుబజార్లు ఉన్నప్పటికీ పూర్ణామార్కెట్‌కు అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. పెద్ద ఎత్తున పూజా సామగ్రి కొనుగోళ్ల నేపథ్యంలో మార్కెట్ కళకళలాడిపోయింది. వ్యాపారులు ఇదే అదనుగా సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది అరటి పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి.


మార్కెట్‌లో జాకెట్ పీసులు అమ్ముతున్న వ్యాపారి

డజను రూ. 100కి మించిన ధరకు విక్రయించారు. కొబ్బరి కాయల ధరలు అందుబాటులో ఉన్నాయి. యాభై గ్రాముల పువ్వులు రూ.150కి పైగా అమ్మకాలు చేశారు. గాజుల దుకాణాలు అధికంగా వెలిశాయి. ట్రాఫిక్ పోలీసులు ముందస్తుగా రహదారిని బారికేడ్లతో మూసివేసి ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. దీంతో రద్దీ అదుపులో ఉంది. మార్కెట్‌లో ప్రశాంతగా అమ్మకాలు సాగాయి.


శ్రావణ శుక్రవారం కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయిన పూర్ణామార్కెట్ రోడ్డు

ట్రాఫిక్, పిక్‌పాకెటర్ల సమస్య లేకుండా..

వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు, జేబుదొంగల బారి నుంచి రక్షణ కల్పించారు. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేశారు. జేబుదొంగల బారి నుంచి కాపాడేందుకు పోలీసులు యూనిఫాం వేసుకోకుండా మఫ్టీలో నిఘా కాశారు. పెద్ద వాహనాలు మార్కెట్‌లోకి రాకుండా కేవలం చిన్న వాహనాలు, ఆటోలు మాత్రమే మార్కెట్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. అంతే కాకుండా రహదారిపై అనధికార దుకాణాలు పెట్టకుండా చర్యలు తీసుకున్నారు.

సీఐ ఔదార్యం


విశాఖ జైలు రోడ్డులో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో స్కూటర్ నడుపుతున్న వృద్ధుడి చేతికి గాయమైంది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సీఐ రేవతమ్మ వెంటనే స్పందించారు. వృద్ధుడి చేతికి ప్రథమ చికిత్స చేసి పంపించారు.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

ప్రకృతి చికిత్సాలయంలో హర్ ఘర్ తిరంగా


హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంతర్జాతీయ క్రీడాకారిణి డాక్టర్ శిష్టా శ్రీలక్ష్మి మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేశారు. యువతలో దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమమే ఇంటింటికీ మువ్వన్నెల జెండా అన్నారు. జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, మహంతి ఆదినారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, రాము, భవన నిర్మాణ కార్మికులు కొండమ్మ, సత్యవతి, సూరీడు, లక్ష్మి, శాంతి, వరలక్ష్మి, రమణమ్మ, మంగ, గేదెల రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులను గుర్తించాలి


అంబేడ్కర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మర్రిపాలెం సమీపంలోని అంబేడ్కర్ కాలనీ, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించా రు. గర్భిణులను గురించాలని, వారికి ప్రభు త్వం ద్వారా వచ్చే పథకాలు అందించాలని, ఐరన్ మాత్రాలు అందజేయాలన్నారు. డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, ముఖ్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


వెంకటేశ్వరమెట్టపై చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో, కోరింత దగ్గు, హెపటైటిస్–బి టీకాలు వేశారు. హెచ్‌వీ గురులక్ష్మి, నారాయణమ్మ, ఏఎన్‌ఎం మదీనమ్మ, ఆశ వర్కర్ ఎం.అనురాధ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వార్డు లో వెంకటేశ్వరమెట్ట1, 2, బంగారుమెట్ట, గౌరీవీధి సచివాలయాల పరిధిలో 60 సంవత్సరాలు దాటిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీటీకాలు కూడా వేశారు. కొబ్బరితోట సచివాలయం పరిధిలో 20 మందికి ఈ టీకాలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. షుగర్ ఉన్నవారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, గత 5 ఏళ్లలో టీబీ పేషెంట్లున్న ఇళ్లలోని కుటుంబ సభ్యులు, 18 సంవత్సరాలు పైబడిన వారు, శరీర బరువు 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, పొగాకు ఉత్పత్తులు వాడుతున్న వారు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు లోపువారు, హెచ్‌ఐవీ ఉన్నవారు, గర్భవతులు, హార్ట్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవారు, డయాలసిస్, కేన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవారు, మూడు నెలల ముందు బ్లడ్ డొనేట్ చేసిన వారు, జ్వరం వస్తున్న వారు వ్యాక్సిన్ వేసుకోరాదని సూచించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వయంగా అమ్మవారికి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజ లు జరిపారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

10వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణ మాసం పూజలు బుధవారం 10వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమానికి బాటలు వేసిన టౌన్‌హాల్


టౌన్‌హాల్ ముఖద్వారం

దాబాగార్డెన్స్ : పాతనగరంలో పేరొందిన చారిత్రక కట్టడం టౌన్‌హాల్. ఇది పురాతన నగర సౌందర్యానికి ప్రతీక. ఆంగ్లో ఇండియన్ వాస్తుకళకు దర్పణం. నగరంలో స్వాతంత్రోద్యమానికి బాటలు వేసిందీ ఈ భవనమే. టౌన్‌హాలు నగర మొట్టమొదటి సాంస్కృతిక కళాభవనం. దీన్ని 1901లో బొబ్బిలి రాజైన వేంకట శ్వేతా చలపతి రంగారావు బహద్దూర్ విక్టోరియా రాణి సామ్రాజ్యాపు వజ్రోత్సవాల సందర్భంగా నిర్మించారు. బ్రిటిషు ప్రభుత్వం తరపున క్యాంప్‌బెల్ దీన్ని 1904లో ప్రారంభించారు.

ఉద్యమానికి బాటలు..

వందేమాతరం ఉద్యమ నేపథ్యంలో 1906లో స్వాతంత్రోద్యమ జాతీయ నేతలు బిపిన్ చంద్రపాల్, ఎస్‌ఎస్ రామస్వామి విశాఖపట్నం టౌన్‌హాలు వద్ద బహిరంగ సభ నిర్వహించి దేశ స్వాతంత్రోద్యమ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం కొద్ది రోజుల్లోనే టౌన్‌హాలు ఎదురుగా ఉన్న సముద్ర తీరంలో (ప్రస్తుతం విశాఖ కంటెయినర్ టెర్మినల్ ఉన్న ప్రాంతం) మరో సభను చేపట్టారు.

- 1916లో స్థానిక నేతలైన భూపతిరాజు వెంకటపతిరాజు, ప్రభల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో టౌన్‌హాల్‌లో రాజకీయ సమావేశం జరిగింది.
- 1919లో సత్యాగ్రహ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6న ఉద్యమ అవసరాన్ని ప్రజలకు వివరించేందుకు మరో సమావేశం టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు.
- 1930లో ఉప్పు సత్యాగ్రహానికి, శాసనోల్లంఘనకు టౌన్‌హాల్ వేదికగా మారింది. స్థానిక ఉద్యమ నేతలైన మారేపల్లి రామచంద్ర కవి, దిగుమర్తి వెంకట రామస్వామి, తెన్నేటి విశ్వనాథం, కొల్లూరు సూర్యంగుప్త, భమిడిపాటి చిన యజ్ఞనారాయణ శర్మ, దిగుమర్తి జానకీబాయ్ తమ అనుచరులతో టౌన్‌హాల్ ఎదుట ఉన్న సముద్రతీరం(ప్రస్తుతం విశాఖ కంటెయినర్ టెర్మినల్ ఉన్న ప్రాంతం)లో ఉప్పు తయారు చేయడం ద్వారా బ్రిటిష్ శాసనాన్ని ధిక్కరించారు.
- రెండవ సారి విశాఖను సందర్శించిన మహాత్ముడు 1933లో టౌన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.
- 1921–1946 మధ్య మహాత్మాగాంధీ విశాఖను ఐదు సార్లు సందర్శించారు.

దత్తత గ్రామాల్లో జాతీయ జెండా ప్రదర్శన


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దత్తత గ్రామాల్లో జాతీయ జెండాతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల ముందుగా మువ్వన్నెల జెండాకు వందనం చేసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సమరయోధుల ప్రాణ త్యాగం, కృషి, పట్టుదల ఫలితమే నేటి స్వాతంత్ర్యమని, యువత మత్తుకు బానిసలు కారాదని, ఆరోగ్యకర ఆలోచనలతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ దేశాభ్యున్నతికి యువత వెన్నెముక వంటి వారని, అవకాశాలు అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. ర్యాలీలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుంటాం


దీక్షా శిబిరంలో పాల్గొన్న టీఎన్‌టీయూసీ నేతలు

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో జరుగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట దీక్షలు బుధవారానికి 1236వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్‌ని రక్షించుకుంటాం అంటూ నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ముప్పాళ్ల శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం

సీతంపేట : శ్రీలలితా పీఠంలో శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహ మహా సంప్రోక్షణలో భాగంగా బుధవారం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తగా తయారు చేయించిన పంచలోహ ఉత్సవ మూర్తులను పలకిలో మేళతాళాలతో ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురార్పణ, వాస్తుపూజ, నవ కలశారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుహోమం జరిపించారు.

అడ్మిన్‌ల సమస్యలు పరిష్కరించాలని వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : సచివాలయ వార్డు అడ్మిన్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. బుధవారం తన ఆధ్వర్యంలో పట్టణ సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ అసోసియేషన్ నాయకులు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వార్డు పరిధిలో అడ్మిన్ సమస్యలను గుర్తించి విలేజీల్లో పంచాయతీ సెక్రటరీలకు ఏ విధమైన అధికారాలు ఉన్నాయో అదే విధంగా వార్డు అడ్మిన్‌లకు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లీవ్‌ల కోసం ప్రత్యేకించి ఒక యాప్ డిజైన్ జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఆ ఇబ్బందులు తొలగిపోతాయని గణేష్ కుమార్ తెలిపారు. కార్యాలయాల్లో స్టేషనరీ కొరత ఉందని, కమిషనర్‌కు తెలపగా, త్వరలో అందరికీ స్టేషనరీ అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు గణేష్‌కుమార్ తెలిపారు. అన్ని సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు నీలి వెంకట సాయి సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. అశోక్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సాయికృష్ణ, నాయకులు చింతకాయల బంగారరాజు, శ్యామలరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

దాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం పున:నిర్మాణానికి ఉద్యమం మరింత ముమ్మరం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విశాఖ నడిబొడ్డున మహారాణిపేటలో జిల్లా కేంద్ర గ్రంథాలయ స్థలం వ్యాపార సంస్థల నిర్మాణానికి 2010లో ఓ ప్రముఖ వ్యక్తికి చెందిన ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చారని, ఫలితంగా నడుస్తున్న గ్రంథాలయ భవనం కూల్చివేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలం సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉందని, గ్రంథాలయ పున:నిర్మాణానికి రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం వెంటనే పూనుకోవాలన్నారు. సమావేశంలో సేవా సమితి అధ్యక్షుడు బీఎల్ నారాయణ, మల్లేశ్వరరావు, రమాప్రభ, ప్రొఫెసర్ ధనరాజు, బి. గంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పార్కును వేగంగా నిర్మించండి

- ఇంజినీరింగ్ అధికారులతో జీవీఎంసీ కమిషనర్
- నత్తనడకన పనులు సాగడంపై ఆగ్రహం

ఆరిలోవ: పిల్లల పార్కు నిర్మాణంపై శ్రద్ధ చూపలేదని ఇంజినీంగ్ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడసర్లోవ ప్రాంతం దీన్‌దయాళ్‌పురం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పిల్లల పార్కును బుధవారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. ఏయే పనులు చేపడుతున్నారు, ఈ పనులు ఎప్పుడు ప్రారంభించారో తదితర విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఎనిమిది నెలల కిందట ప్రారంభమైన పార్కు పనులు నత్తనడకన సాగుతున్నట్లు గుర్తించిన కమిషనర్.. ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. ఎందుకు ఇంత నెమ్మదిగా జరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు తొందరగా జరిపించకపోవడం వల్ల జీవీఎంసీపై ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ఇప్పటి నుంచి వేగంగా పనులు నిర్వహించి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పార్కులో పనులు చేపట్టడానికి ఆటంకంగా ఉన్న చెట్లు తొలగించి వేరే చోట(ట్రీ ట్రాన్స్‌లోకేషన్) నాటించాలన్నారు. పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్లు, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట ప్రాంతం(మైదానం), 15 ఏళ్ల లోపు పిల్లలకు అవసరమైన అన్ని రకాల ఆట పరికరాలు అమర్చడంతోపాటు మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, జోన్–2 కమిషనర్ శైలజావల్లి, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజ్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్.కిశోర్, ఏఈ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ముడసర్లోవ వద్ద పిల్లల పార్కులో మ్యాప్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

బెల్లం వినాయకుడిని దర్శించుకున్న హోం మంత్రి

మహారాణిపేట : కలెక్టరేట్ సమీపంలో ఉన్న బెల్లం వినాయకుడిని బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లం వినాయకుడి మొక్కుబడిని మంత్రి తీర్చుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు.

తెలుగు విభాగంలో పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య అప్పారావు తదితరులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ఎలవర్తి విశ్వనాథ రెడ్డి సంపాదకత్వం వహించిన తెలుగు భాష సాహిత్యం, సంస్కృతులపై బౌద్ధ మత ప్రభావం పుస్తకావిష్కరణ సభ బుధవారం జరిగింది. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య మర్రిబోయిన జయదేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖాధిపతి అప్పారావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు బౌద్ధమతం ఎలా దగ్గరైందో.. అలాగే తెలుగు శాఖ గొప్పతన్నాన్ని కూడా పుస్తకం ద్వారా తెలియజేశారన్నారు. విశ్రాంత ఆచార్యుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తన సంపాదకత్వం వహించిన పుస్తకాన్ని తాను పని చేసిన శాఖలోనే ఆవిష్కరించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. ఆచార్య జయదేవ్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న అనేక మూఢ నమ్మకాలను నాటి కాలంలో బౌద్ధమతం దూరం చేసిందన్నారు. డాక్టర్ ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేస్తూ వ్యక్తి పరిపూర్ణంగా మారడానికి బౌద్ధ మతం దోహదపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ బౌద్ధ మతం ఆసియాకు మాత్రమే కాకుండా ప్రపంచానికి వెలుగునిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య యోధుల పోరాటం యువతకు స్ఫూర్తి


హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి షారోన్‌రాజు తదితరులు

విశాఖ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని నేటి యువత స్వీకరించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, స్వాతంత్ర్య యోధుల పోరాటం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భావి భారతావనికి అవసరమైన దేశభక్తి కలిగిన యువతను తయారు చేసే దిశగా ఇటువంటి కార్యక్రమాలను విభాగంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను వివరించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో బీవోఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగరాజా కుమారి, డాక్టర్ ఎం.వి.ఎస్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ మూర్తి, డాక్టర్ ఎస్.హేమలత, డాక్టర్ వెన్నెల కుమారి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.